క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ, జ్యోతినగర్‌లోని లూథరన్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ఎస్వీఎస్ హాస్పిటల్ వైద్యులు రఘురాములు, క్రిష్ణకుమార్, వీకే మానస సుమారు 200 మందికి వైద్య, రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ టైసింగ్ విక్టర్, రాజ్ భగవాన్, ప్రసాద్, ఎంఎల్‌టీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ



బీరువాను పగులగొట్టి బంగారు నగలు చోరీ చేసిన దుండగులు

ఏర్పేడు: మండలంలోని అముడూరు పంచాయతీ మల్లంపల్లిలో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలను చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మల్లంపల్లి గిరిజన కాలనీకి చెందిన గజ్జల నాగరాజు, నారాయణమ్మ బుధవారం ఇంటికి తాళం వేసి వెంకటగిరి పోలేరమ్మ జాతరకు వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చారు. తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గుర్తించారు. బీరువాలో దాచి ఉంచిన మొత్తం 20 గ్రాములు బంగారు చైను, జత కమ్మలు, రెండు ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీరామ్ నగర్ కాలనీలోని సాయిబాబా సత్సంగకేంద్రం 22వ వార్షికోత్సవం పురస్కరించుకొని రోటరీ క్లబ్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు సాయిబాబా గీతాలకు చేసిన నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. మా ఇంటి దైవం మా కంటి దీపం నీవేలే సాయి అంటూ సాయిబాబాను స్తుతిస్తూ చిన్నారులు దర్శిని, జ్ఞాపిక, చందన, లోహిత్, రాజీవిని, జయవాణి బృందం చేసిన భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కనకాచలంలో 22 నుంచి విజయ దశమి వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల, ఈవో

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధ కనకాచలం కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1 వరకు దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి తెలిపారు. వారు ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వున్న గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విజయదశమి ఉత్సవాలకు సంబంధించి కనకాచలంపై ఏర్పాట్లు ముమ్మరం చేసినట్టు తెలిపారు. మెట్ల మార్గంలో విద్యుత్ దీపాలంకరణ, ఆలయం వద్ద చలువ పందిళ్లు, భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు.

వైభవంగా పడిపూజ

నగరి: పట్టణ పరిధి బైపాస్ మలుపు వద్ద గల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలకు, పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అయ్యప్ప భజనల అనంతరం మెట్లపై దీపాలు వెలిగించి పడిపూజ చేశారు.

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకోవాలని కోరారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ఎంపిక చేసిన దళవాయి అగ్రహారం చెరువు



షాదీఖానా పనులు ఇలా..

పంచాయతీ పరిధిలో ముస్లింలు వివాహాలు జరుపుకునేందుకు 25 ఏళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే శివప్రసాద్‌ను షాదీఖానా నిర్మించాలని కోరగా.. అప్పట్లో ఆయన పనులు ప్రారంభిస్తున్నట్లు శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు షాదీఖానా పూర్తి కాలేదు. భవన నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే ఉంది.

షాదీఖానా శిలాఫలకం.. పక్కనే అసంపూర్తిగా ఆగిన భవనం



పాతికేళ్లుగా సిగ్గు పడుతున్నాయ్

సత్యవేడులో ఇంటర్ స్టేట్ బైపాస్ రోడ్డు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులతో పాటు షాదీఖానా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఈ పనులకు సాక్ష్యంగా వేసిన శిలాఫలకాలే నిలుస్తున్నాయి. అయిదు పర్యాయాలుగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పనులు చేపడతామని హామీలు ఇచ్చారే తప్ప ప్రారంభానికి నోచుకున్న పాపాన పోలేదు. 25 ఏళ్లుగా సత్యవేడు ప్రజలు ఎదురుచూస్తున్న దాసుకుప్పం బైపాస్, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు ఎండమావిగానే మారాయి.

- నెరవేరని సత్యవేడు ప్రజల చిరకాల కోరికలు
- ఇంటర్ స్టేట్ బైపాస్‌రోడ్డు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులకు గ్రహణం
- 25 ఏళ్ల కిందట అప్పటి మంత్రి, ఎమ్మెల్యేలు వేసిన శిలాఫలకాలు శిలలుగా మిగిలిన వైనం
- ఏళ్ల తరబడి హామీలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్న ఎమ్మెల్యేలు
- ఎన్నటికి పూర్తయ్యేనో అంటున్న స్థానిక ప్రజలు





దాసుకుప్పం ఇంటర్ స్టేట్ బైపాస్ రోడ్డుకు వేసిన శిలాఫలకం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు శిలాఫలకం

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రం సత్యవేడులో ప్రధానంగా రెండు పనులు చేపట్టేందుకు సుమారు 25 ఏళ్ల కిందట అప్పటి మంత్రి శివప్రసాద్, రాష్ట్ర మంత్రుల సమక్షంలో శిలాఫలకాలు వేశారు. ఇంటర్ స్టేట్ బైపాస్‌రోడ్డు నిర్మాణానికి అప్పట్లో నాబార్డు నిధులు రూ.45 లక్షలు మంజూరయ్యాయి. నాడు మంత్రి హోదాల శివప్రసాద్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేశారు. అప్పట్లో స్థల వివాదంతో రోడ్డు కథ కంచికి చేరింది. స్థల వివాదం కాస్త రాజకీయ రంగు పులుముకోవడంతో చివరకు దాని ఊసే మరిచారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, కోనేటి ఆదిమూలం దాసుకుప్పం బైపాస్‌రోడ్డు వేస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచారు. భూసేకరణకు నిధులు స్వల్పంగా మంజూరు కావడం, స్వల్ప ధరకే భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్యేలు వారి అయిదేళ్లపాటు కథలు చెబుతు కాలం వెల్లదీశారే తప్ప బైపాస్ రోడ్డు పూర్తికి కృషి చేయలేదు.

భూసేకరణలో జాప్యం

సత్యవేడు పట్టణంతో పాటు మరో 14 గ్రామ పంచాయతీలకు తాగునీటి సమస్య తీర్చే సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు ఎండమావిగానే మిగిలాయి. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్ రూ.4 కోట్లు మంజూరు చేయించి సమ్మర్ స్టోరేజీ నిర్మాణానికి శిలాఫలకం వేయించారు. ఈపనుల్లో భాగంగా తెలుగు గంగ కాలువ సమీపంలో ఫిల్టర్ బెడ్, పంపింగ్ మోటారు, తెలుగు గంగ కాలువలో బోరు ఏర్పాటు చేశారు. గంగ కాలువలో నీటి ప్రవాహం ఉంటే సత్యవేడు ప్రజలకు నీటికి ఇబ్బంది ఉండదు. నీటి ప్రవాహం ఆగితే కాలువలోని బోరు అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించడం సాధ్యం అయ్యేది కాదు.

రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా..!

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు రెండు పర్యాయాలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ట్యాంకు ఏర్పాటుకు సుమారు 28 ఎకరాల స్థలం అవసరం ఉంది. దళవాయి అగ్రహారం చెరువు విస్తీర్ణం 18 ఎకరాలు మాత్రమే ఉండడంతో మరో 10 ఎకరాలు చెరువు సమీపంలో రైతుల నుంచి భూమి సేకరించాల్సి ఉంది. రైతుల నుంచి పట్టాభూములు సేకరణలో అధికారులు జాప్యం చేస్తుండడంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి నోచుకోలేదు. సత్యవేడు ప్రాంతంలో ఎస్ఈజెడ్ ఉండడంతో భూముల ధరకు రెక్కలొచ్చాయి. దీంతో భూసేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతం భూసేకరణకు నిధులు భారీగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపాలి..

రెండు పర్యాయాలు సత్యవేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం సత్యవేడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి వసతి కల్పించాలి



సత్యవేడు పంచాయతీలోని దళవాయి అగ్రహారం చెరువును సమ్మర్ స్టోరేజ్‌గా ఆధునీకరించి సత్యవేడుతో పాటు మరో 14 గ్రామాలకు నీటి వసతి కల్పించాలి. తెలుగు గంగ కాలువలో నీరు లేకపోతే తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు త్వరితగతిన సమ్మర్ స్టోరేజ్‌కు భూసేకరణ పనులు పూర్తి చేయాలి. –పళణి, సత్యవేడు

షాదీఖానా పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణం పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే ప్రభుత్వ నిధులు విడుదల చేయించాలి. షాదీఖానా పూర్తయితే సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లోని ముస్లింలు వివాహాలు చేసుకునేందుకు ఉంటుంది. నిధుల మంజూరుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి. –ఇస్మాయిల్ సత్యవేడు

సమాజ సేవలో ఓంశక్తి భక్తులు



శ్రమదానం చేస్తున్న ఓంశక్తి భక్తులు

నారాయణవనం: మేశ్‌మరవత్తూరు ఆదిపరాశక్తి మాలను ధరించిన భక్తులు సమాజ సేవలో భాగంగా ఆదివారం బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం 23వ వార్షికోత్సవ సందర్భంగా శ్రమదానం నిర్వహించినట్లు రాష్ట్ర కార్యదర్శి భాస్కరన్ తెలిపారు. ఉద్యమ రాష్ట్ర అధ్యక్షుడు అన్బళగన్ జన్మదినాన్ని వార్షికోత్సవంగా నిర్వహిస్తూ ప్రజాసేవ కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం బాలికల ఉన్నత పాఠశాల పరిసరాలను, క్రీడా మైదానాన్ని శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రారంభ సమావేశంలో హెచ్ఎం మనోహరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. మనోధైర్యంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యమ పర్యవేక్షకులు గోవిందస్వామి, కలాకర్, రాజేష్‌నాయుడు, చెంగయ్య, మునస్వామి, వంద మంది ఓంశక్తి మహిళా భక్తులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నాగలాపురం: మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లోకి నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. ఆదివారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి బస్టాండు ఆవరణలో వర్షపునీరు నిలబడడంతో గుంతల్లో నిలిచిపోయింది. సాధారణంగా ఎస్ఎస్ పురం, బీరకుప్పం తదితర గ్రామాల నుంచి ప్రజలు రోజూ వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రమైన నాగలాపురానికి నిత్యం వస్తుంటారు. కాలి నడకన వెళ్లే ప్రజలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఈ బురదగుంతలు ఉన్న చోట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైన స్పందించి బస్టాండ్ ఆవరణలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

తొట్టంబేడు: స్త్రీ శక్తి పథకంతో ఆర్థికంగా నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆటో కార్మికుల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం కారణంగా ఆటోలకు బాడుగలు లేక డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే వాహన మిత్ర కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై జరిమానాల పేరిట వేధించడం తగదన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో రవాణా రంగ కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టబోయే ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ప్రాంతీయ అధ్యక్షులు గురునాథం, కార్యదర్శి పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

మునేశ్వరుడికి సామూహిక పొంగళ్లు





మునేశ్వరుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు, మునేశ్వరుడికి నైవేద్యాలు సమర్పణ

రేణిగుంట: మండలంలోని రామకృష్ణాపురంలోని వున్న మునేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టారు. మునేశ్వరుడిని కుల దేవుడిగా కొలిచే వారు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా మహిళలు పంబ వాయిద్యాల మధ్య సామూహికంగా పొంగళ్లను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు సిద్ధం చేసి స్వామికి సమర్పించారు. మధ్యాహ్నం సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ కుల దేవుడైన మునేశ్వరుడికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు మొదటి సారిగా సామూహికంగా పొంగళ్లు పెట్టారని తెలిపారు.

తప్పిపోయిన యువతి బంధువులకు అప్పగింత



యువతిని బంధువులకు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సంధ్య

పాకాల: మానసిక స్థితి సరిగా లేని ఓ యువతిని ఎట్టకేలకు బంధువులకు అప్పగించారు. ఆ యువతి తప్పిపోయి శనివారం మండలంలోని కుందేటిపల్లెకు చేరుకోవడం విదితమే. ఆదివారం ఐసీడీఎస్ పాకాల సెక్టార్ సూపర్‌వైజర్ కిరణ్మయి మాట్లాడుతూ, ఆ యువతిని గ్రామస్తులు, తమ అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో రక్షించి, కుందేటివారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త సంధ్య సంరక్షణలో ఉంచినట్టు చెప్పారు. ఆ యువతి తన పేరు చిన్ని అని చెప్పిందని, ఆమె తెలిపిన వివరాల మేరకు రేణిగుంట మండలం మామండూరులోని సమీప బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడూ ఇలా వెళ్లిపోతుంటుందని బంధువులు పేర్కొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

వరదయ్యపాళెం: మండలంలోని తొండంబట్టులో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఎంజీనగర్ అరుంధతివాడలో మాతమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు స్థానిక గ్రామస్తులు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు తొండంబట్టులోకి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన గేటుకు వేసిన తాళం పగులగొట్టి గర్భగుడిలోని అమ్మవారికి అలంకరించిన బంగారు తాళిబొట్టు, స్వామివారికి అలంకరించిన వెండి కిరీటం, మరికొన్ని వెండి ఆభరణాలు, హుండీలోని నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఎంజీ నగర్ అరుంధతివాడలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరించిన బంగారు తాళిబొట్టును తీసుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెండు ఆలయాలను ఎస్ఐ మల్లికార్జున, సిబ్బందితో కలసి ఆదివారం సాయంత్రం సందర్శించి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద అవినాష్ వసంత ప్రభు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ ఆఫీసర్ అవినాష్ వసంత ప్రభు, బరోడా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి, జనరల్ మేనేజర్లు రితేష్ కుమార్, సీఎం త్రిపాఠి దర్శించుకున్నారు. వారికి అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

17,18 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

నింద్ర: మండల కేంద్రంలో ఈనెల 17,18 తేదీల్లో క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వసుమతి, శ్రీధర్‌రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికల ఎంపిక స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో ఉంటుందని తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునని చెప్పారు.

బాల్య వివాహాలను నివారిద్దాం



అవగాహన కల్పిస్తున్న ప్రగతి సంస్థ కోఆర్డినేటర్

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుందని ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ రాజారెడ్డి తెలిపారు. బాల్య వివాహాల నివారణకు యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ సంస్థ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రగతి సంస్థ ఆదివారం శ్రీకాళహస్తిలోని పూసలవీధిలో వున్న మసీదులో అధ్యక్షుడు షన్వాస్ ఆధ్వర్యంలో ఇమాం, ముస్లింలు, చర్చిలో పాస్టరు ఆంబ్రోస్, వివిధ సంఘాల నాయకులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను నివారించడానికి ప్రభుత్వంతో కలిసి ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాలను నివారించడానికి గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ కార్యక్రమాన్ని 100 దేశాలలో ప్రారంభించిందన్నారు. వివాహాలు ఎక్కువ జరిగే దేవాలయాల్లో పురోహితులు, మసీదులలో ఖాజీ, హజరత్, హిమాం, చర్చిల్లో పాస్టర్, మత పెద్దలతో బాల్య వివాహాల గురించి చర్చించి వారి ద్వారా సమాజానికి సందేశం ఇప్పించగలిగితే ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. మసీదు ప్రెసిడెంట్ షాన్వాస్, చర్చ్ పాస్టర్ అంబ్రోస్ మాట్లాడుతూ చుట్టుపక్కల బాల్య వివాహాలు జరగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఇమామ్, లాలు బాష, షబ్బీర్, ఉస్మాన్, మౌలాలి, అబ్దుల్లా, పాస్టర్స్ ప్రఫైల్, డేనియల్, లూకా, సోషల్ యాక్టివిస్ట్ గోవర్ధన్, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ చందమామల కోటయ్య, లత, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: వాహనాలను నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని స్థానిక చెక్‌పోస్టు వద్ద వాహనాల రికార్డు, వాహనదారుల లైసెన్సు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రికార్డు సక్రమంగా లేని వాహనాలు ఎక్కువగా ఉండడంతో వాటిని గుర్తించడానికి వాహనాల రికార్డులు, వాహనదారుల లైసెన్సును తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. రికార్డులు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. ఇసుక ట్రాక్టర్ల యాజమానులు ట్రక్కులోని ఇసుకపై కూర్చోబెట్టి కూలీలను తలిస్తున్నారని, దీనివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేయడం చట్టరీత్యానేరమన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని తెలిపారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

రేణిగుంట: స్థానిక జీఎం వీధిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో చేరారని తెలిపారు. తుదిశ్వాస విడిచే వరకు సీపీఎంలో పేదల కోసం పనిచేశారని తెలిపారు. ఆయన బాటలో నడవడమే మనం ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఓ.వెంకటరమణ, జిల్లా కార్యదర్శి జయచంద్ర, బాలాజీ, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, ఎంపీటీసీ రాజేశ్వరి, టౌన్ కార్యదర్శి ఈశ్వరమ్మ, సత్యశ్రీ, సెల్వరాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి: తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు పలువురు మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారు సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకునేందుకు రానున్నారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.